కీలు మార్పిడిలో కొత్త టెక్నాలజీ

దేశ జనాభాలో సుమారు 15 శాతం మంది మోకాలి కీళ్ల నొప్పుల వ్యాధితో బాధపడుతున్నారు. ఒకప్పుడు కీలు మార్పిడి చేయాలంటే అందుబాటులో ఉన్న కృత్రిమ కీలును అమర్చేవారు. అయితే ప్రస్తుతం కొత్త టెక్నాలజీ అందుబాటులోకి వచ్చింది. ఒక మనిషికి కావల్సిన కీలును ప్రత్యేకంగా తయారుచేస్తున్నారు. ఇది గతంలో కంటే చాలా తక్కువ ఖర్చుతో కూడుకున్నదని చెబుతున్నారు సీనియర్ ఆర్థోపెడిక్, జాయింట్ రిప్లేస్‌మెంట్ సర్జన్ డాక్టర్ కె.సుధీర్‌రెడ్డి.

మనిషిని పోలిన మనుషులు ఉన్నప్పటికీ ఏ ఒక్కరి శరీర ఆకృతి ఒకేరకంగా ఉండదు. ముఖ్యంగా మనిషి మోకాలు ఒకేరకంగా ఉండదు. ఇప్పటి వరకు మనిషి శరీరంలోని ఏదైనా అవయవాన్ని మార్చాలంటే ఆ మనిషి అవయవానికి సరిపోయే ఇంప్లాంట్స్ అమర్చేవారు. కాని ఆధునిక సాంకేతిక విజ్ఞానం సాధించిన విజయాలలో కృత్రిమ కీలు తయారీ ఒకటి. ఇప్పుడు ఏ రోగికి కీలు మార్పిడి కావాలో ఆ వ్యక్తి కీలు సైజు, ఆకారం కొలతలు తీసుకుని అదే సైజు ఆకారంలో ప్రత్యేకంగా తయారు చేసి కీలు మార్పిడి చేసే రోజులు వచ్చేశాయి.

పాతపద్ధతిలో చికాకులు

ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న వివిధ శస్త్ర చికిత్సల్లో ఉత్తమ ఫలితాలిస్తున్న ఆపరేషన్ ఈ మోకాలి కీలుమార్పిడి. మన దేశంలో కీళ్ల నొప్పులతో బాధపడుతున్న 15 శాతం మందిలో కొంతమందికి కీలు మార్పిడి అవసరం. తీవ్రమైన మోకాలి నొప్పులతో బాధపడుతున్న రోగులకు నొప్పి తగ్గించేందుకు ఇతర చికిత్సలు ఫలితమివ్వని పరిస్థితులలో మోకాలి కీలు మార్పిడి అవసరమవుతుంది. గతంలో ఈ కీలు మార్పిడి చాలా ఖరీదైన సర్జరీగా భావించేవారు. అయితే ఇప్పుడు చాలా తక్కువ ఖర్చుతో ఈ సర్జరీ జరుగుతోంది. ప్రపంచవ్యాప్తంగా ఈ సర్జరీ ఇప్పుడు సత్ఫలితాలిస్తోంది. నూటికి 99 శస్త్ర చికిత్సలు సక్సెస్ అవుతున్నాయి. ఒకసారి మార్చిన కీలు 20-25 ఏళ్లపాటు పనిచేస్తుంది. కీలు మార్పిడి ఆపరేషన్ సెక్సెస్ అయినప్పటికీ దాదాపు 33 శాతం మంది ఇంకా కొంత ఇబ్బంది పడుతున్నారని ప్రపంచవ్యాప్తంగా జరిగిన సర్వేలో వెల్లడైంది. ముఖ్యంగా మెట్లు ఎక్కడంలో ఇబ్బంది, కొద్దిపాటి వాపు, కింద కూర్చోవడంలో ఇబ్బంది వంటివి ఉంటున్నాయి. మోకాలి కీలు మార్చుకున్న వారికి ఎక్స్‌రే ప్రకారం చూసినట్లయితే వందశాతం బాగున్నట్లే ఉంటుంది. ఇంకా కొంత ఇబ్బంది ఉండడానికి ప్రధాన కారణం మార్చిన కీలు సైజు పూర్తిస్థాయిలో మోకాలికి అనువుగా లేకపోవడమేనని నిపుణులు భావిస్తున్నారు. రెడీమేడ్ దుస్తులు నిర్ణీత సైజులలో మాత్రమే తయారవుతాయి. ప్రజలు కొంచెం అటు ఇటుగా తమకు సరిపోయే సైజు దుస్తులను కొంటారు. అలాగే ఈ మోకాలి కీలు మార్పిడిలో కూడా కీలు సైజుకి దగ్గరగా ఉంటే ఇంప్లాంట్స్ ఎంచుకోవడం జరుగుతుంది. ఆ ఇంప్లాంట్‌కి అనుగుణంగా రోగి మోకాలి కీలును సరిచేసి ఫిక్స్ చేస్తారు. ఇదంతా ఒకప్పటి పద్ధతి.

కొత్త టెక్నాలజీ

మారిన టెక్నాలజీలో రోగికి మరింత సౌకర్యవంతంగా ఉండేందుకు కీలు మార్పిడి ఆపరేషన్ అవసరమైన రోగికి కచ్చితంగా సరిపోయే ఇంప్లాంట్‌ను తయారుచేసి అమరుస్తున్నారు. ముందుగా రోగి మోకాలి కీలును ఎంఆర్ఐ ద్వారా స్కాన్ చేసి ఇంప్లాంట్స్ తయారు చేసే ఫ్యాక్టరీకి పంపితే ఆ సైజులోనే ప్రత్యేకంగా ఆ రోగికి మాత్రమే సరిపోయే కృత్రిమ కీలును తయారుచేస్తారు. ఈ పద్ధతిని కస్టమ్ మేడ్ లేదా టైలర్ మేడ్ నీ రిప్లేస్‌మెంట్ అంటారు. ఇలా తయారు చేసిన కీలు సంబంధిత రోగికి మాత్రమే సరిపోతుంది. కీలు అమరిక కచ్చితంగా ఉండడం వల్ల ఆపరేషన్ తర్వాత ఇబ్బందులు తలెత్తే అవకాశాలు ఉండవు. దీర్ఘకాలంలో కూడా ఫలితాలు బాగుంటాయి.

మన దేశంలోనూ..

ఈ సౌకర్యం మన దేశంలో కూడా ఇటీవలే అందుబాటులోకి వచ్చింది. కీలు మార్పిడి అవసరమైన వారు ఆపరేషన్‌కు ఆరు వారాల ముందుగానే వైద్యులను సంప్రదించాల్సి ఉంటుంది.రోగి మోకాలిని ప్రత్యేకమైన సాఫ్ట్‌వేర్‌తో ఎంఆర్ఐ స్కాన్ చేసి కాడ్‌కామ్ ద్వారా సైజులు తీసుకుని కీలు ఇంప్లాంట్ తయారుచేసే కంపెనీకి పంపడం జరుగుతుంది. రోగికి సరిపోయే కృత్రిమ కీలును తయారు చేసి అమర్చడం వల్ల మరింత మెరుగైన ప్రయోజనాలు రోగికి లభించగలవని వైద్య నిపుణులు విశ్వసిస్తున్నారు.

డాక్టర్ కె.సుధీర్‌రెడ్డి
సీనియర్ ఆర్థోపెడిక్ అండ్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్
డక్కన్ హాస్పిటల్, సోమాజిగూడ, హైదరాబాద్
ఫోన్:98669 39188, 90001 28000



సకల sakala

ఆంధ్రజ్యోతి

15-11-2011 మంగళవారం | 2

మెదడు సమస్యలకు కీహోల్ సర్జరీ వరం

ఆధునిక జీవనశైలి కారణంగా మెదడు సంబంధిత వ్యాధులు పెరిగిపోతున్నాయి. మెదడులో రక్తనాళాలు బ్లాక్ అవటం, చిట్లిపోయి బ్రెయిన్ స్ట్రోక్‌తోపాటు బ్రెయిన్ హెమోరైజ్‌లు వచ్చిపడుతున్నాయి. ఈ సమస్య పరిష్కారానికి బ్రెయిన్ ఓపెన్ సర్జరీ కాకుండా ఇండో వాస్కులర్ న్యూరో సర్జరీ అందుబాటులోకి వచ్చింది. ఈ సర్జరీతో అనేక లాభాలున్నాయంటున్నారు న్యూరో సర్జన్ డాక్టర్ రణధీర్ కుమార్.

డాక్టర్ రణధీర్ కుమార్
న్యూరో సర్జన్
యశోద న్యూరో ఇన్‌స్టిట్యూట్
యశోద హాస్పిటల్స్
సోమాజిగూడ, హైదరాబాద్
ఫోన్ : 9966338994

గుండె నుంచి మెడ భాగం నుంచి మెదడుకు నాలుగు నాళాలు రక్తాన్ని సరఫరా చేస్తాయి. సున్నితమైన ఈ రక్తనాళాల్లో రక్తసరఫరాలో ఆటంకం ఏర్పడినా, మెదడులో ఉన్న రక్తనాళాలు చిట్లినా బ్రెయిన్ స్ట్రోక్, బ్రెయిన్ హెమోరేజ్ రావచ్చు. మెదడులో ఏర్పడే ఈ సమస్యలు హృద్రోగాల కంటే ప్రమాదమైనవి. గతంలో మెదడు సంబంధ సమస్యలతో 90 శాతం మంది రోగులు మరణించే వారు. కాని అభివృద్ధి చెందిన ఆధునిక వైద్యంతో కోలుకుంటున్న రోగుల సంఖ్య పెరిగింది.

ఎందుకు వస్తాయి?

అధిక రక్తపోటు, మధుమేహం అదుపులో ఉంచుకోకపోవటం, ధూమపానం, అధికంగా మద్యం సేవించటం, స్థూలకాయం, కొవ్వు ఉన్న ఆహారపదార్థాలు ఎక్కువగా తినటం, వంశపారంపర్యంగా కుటుంబంలో ఎవరికైనా మెదడు సంబంధ జబ్బులు ఉండటం లాంటి కారణాలతో మెదడులో రక్తనాళాలు బ్లాక్‌అవటం, చిట్లిపోవటం జరుగుతుంది.

కళ్లు బైర్లుకమ్మితే...

మెదడులోని రక్తనాళాల్లో ఆటంకం ఏర్పడినపుడు రోగికి అకస్మాత్తుగా బ్రెయిన్ స్ట్రోక్ వస్తుంది. అధిక తలనొప్పి, వాంతులవటం, ఒకవైపు కాళ్లు, చేతులు పనిచేయక పోవటం, ఫిట్స్ రావటం జరుగుతుంది. మాట్లాడుతుండగానే, లేదా బాత్రూంకు వెళ్లి వచ్చేలోగా ఆకస్మాత్తుగా వచ్చే ఈ బ్రెయిన్ స్ట్రోక్‌తో రోగి కోమాలోకి కూడా వెళ్లే అవకాశముంది. మెదడులోని రక్తనాళాలు చిట్లినపుడు తీవ్ర తలనొప్పితోపాటు ముఖంలో మార్పులు సంభవిస్తాయి. కళ్లు తిరగటం, ఆకస్మాత్తుగా బ్లరింగ్ విజన్ రావటం, మాట్లాడలేక పోవటం, ఏ వైపు రక్తనాళాలు చిట్లితే ఆ వైపు కాలు, చేయి పడిపోవటం జరుగుతుంది. ఒక్కోసారి కొందరికి మెదడులో మైనర్‌స్ట్రోక్ వచ్చి 30 నిమిషాల తర్వాత తగ్గుతుంది. మెదడు రక్తనాళంలో చిన్న ఆటంకం ఏర్పడినపుడు ఇలా మైనర్‌స్ట్రోక్ వస్తుంది.

సత్వర చికిత్స

మెదడు సంబంధ సమస్యలు ఏర్పడినపుడు రోగిని 8 గంటల్లోగా ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించాలి. మెదడులో ట్యూమర్ ఏర్పడినపుడే దాన్ని తొలగించేందుకు ఓపెన్ బ్రెయిన్ సర్జరీలు చేస్తున్నారు. మెదడు రక్తనాళాల్లో ఆటంకమేర్పడినా, బెలూన్‌లా ఉబ్బినా, రక్తనాళాలు చిట్లినా ఇండోవాస్కులర్ న్యూరో సర్జరీ విధానంలో చికిత్స చేస్తున్నారు. దాన్నే మినిమల్ ఇన్‌వెజిల్ సర్జరీ అంటారు.ఈ అధునాతన సర్జరీల వల్ల మెదడు సంబంధ వ్యాధి వచ్చినా, సత్వరం కోలుకుంటున్న రోగుల సంఖ్య పెరిగింది.

కెరటిడ్ యాంజియో ప్లాస్టి : గుండెకు చేసే యాంజియో ప్లాస్టీ లాగా మెదడులోని రక్తనాళాల్లోని ఆటంకాలను తొలగిస్తారు. మెదడులోని రక్తనాళంలో 80 శాతానికి పైగా బ్లాక్ అయినపుడు, మెదడుకు రక్తసరఫరా తగ్గుతుంది. ఇలాంటపుడు కాలి రక్తనాళం నుంచి రంధ్రం చేసి దాని ద్వారా బెలూన్ సాయంతో స్టంట్ వేస్తారు.

ఇండో వాస్కులర్ అక్యూట్ థ్రంబోలైసిస్ : మెదడులోని రక్తనాళంలో రక్తం గడ్డ కట్టినపుడు ఈ విధానంలో టిస్యూ ప్లాజ్మినోజెన్ యాక్టివేటర్ (టీపీఏ) అనే మందును కాలి రక్తనాళం ద్వారా మెదడులోని నాళానికి పంపించి రక్తం గడ్డను కరిగిస్తారు. మెదడు రక్తనాళాల్లో బెలూన్‌లు ఏర్పడినపుడు రక్తనాళాలు చిట్లుతాయి. ఇలాంటి సమయంలో అనుర్‌యెసీన్ బెలూన్‌ల ద్వారా కెథటిడ్ అనే మందును పంపించి ప్లాటినం కాయల్ ను రక్తనాళం బెలూన్‌లో ఫిల్లింగ్ చేస్తారు.

యాట్రియో వెనస్‌మాల్ ఫార్మేషన్స్ : పుట్టుకతో జెనిటిక్ ద్వారా చిన్న పిల్లలకు వస్తున్న ఈ మెదడు సంబంధ వ్యాధికి ఇండో వాస్కులర్ విధానంలో చికిత్స చేస్తారు. సాధారణంగా పది నుంచి పదిహేనేళ్ల పిల్లల్లో వస్తున్న ఈ సమస్యకు ఇండో వాస్కులర్ విధానంలో స్పెషల్ గ్లూక్ ద్వారా ఓనెక్స్ అనే మందును మెదడు రక్తనాళంలోకి పంపించి చికిత్స చేస్తారు.

పాలీవీనమ్ ఆల్కహాల్ పాటికల్ (పీవీఏ) : బ్రెయిన్ ట్యూమర్లకు శస్త్రచికిత్స చేసేటపుడు రక్తం బ్లీడింగ్‌ను నివారించటానికి సరికొత్త మందు అందుబాటులోకి వచ్చింది. మెదడులో ఏర్పడే చాలా రకాల ట్యూమర్లను తొలగించటానికి శస్త్రచికిత్స అవసరం. శస్త్రచికిత్సకు ముందు పాలీవీనమ్ ఆల్కహాల్ పాటికల్ అనే మందును ట్యూమర్‌లోకి పంపించగానే బ్లీడింగ్‌ను నివారిస్తుంది. ఈ విధానంలో ట్యూమర్‌ను తొలగిస్తున్నపుడు బ్లీడింగ్ కాకుండా నివారించవచ్చు.

ఇండో వాస్కులర్‌తో ఉపయోగాలెన్నో...

మెదడు సంబంధ సమస్యలకు బ్రెయిన్ ఓపెన్ సర్జరీ కాకుండా ఇండో వాస్కులర్ న్యూరో సర్జరీ చేయటం వల్ల అనేక ప్రయోజనాలున్నాయి. ప్రాణాపాయం లేకుండా సత్వర వైద్యం లభిస్తుంది. రోగి రెండో రోజే ఆసుపత్రి నుంచి డిశ్చార్జి కావచ్చు. వెంటిలేటర్‌పై, ఆసుపత్రిలో ఎక్కువ రోజులు ఉండే అవసరం ఉండదు.

ఒకే రోజులో సర్జరీ, డిశ్చార్జ్ సాధ్యమా?

నా వయస్సు 32 సంవత్సరాలు. కొంతకాలంగా నాకు పొత్తికడుపులో తీవ్రమైన నొప్పి వస్తోంది. తరచూ బ్లీడింగ్ కూడా అవుతోంది. పెళ్లయి నాలుగేళ్లవుతోంది. ఇంతవరకూ పిల్లలు లేరు. డాక్టర్‌ని కలిస్తే ఫైబ్రాయిడ్స్ ఉన్నాయి, గర్భాశయంలో సమస్య కూడా ఉందని చెప్పారు. పరీక్షలన్నీ చేసి అవసరమైతే సర్జరీ చేయించుకోవాల్సి ఉంటుందన్నారు. ఇంట్లోగానీ, నేను చేస్తున్న ఉద్యోగంలోని గానీ ఒక్కరోజు కంటే ఎక్కువ సెలవు పెట్టుకోలేని పరిస్థితి నాది. ఒకేరోజులో ఆపరేషన్ చేయించుకుని డిశ్చార్జ్ కావడం సాధ్యపడుతుందా? చికిత్సా విధానంలో ఏమైనా ఆధునిక పద్ధతులు ఉన్నాయా? తగిన సలహా ఇవ్వండి.

- కల్పన, సికింద్రాబాద్

ప్రస్తుతం చాలా అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ అందుబాటులో ఉంది. కాబట్టి మీరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. చాలా రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు, సర్జరీలు డేకేర్ ప్రొసీజర్‌లో జరుగుతున్నాయి. ఉదయం ఆసుపత్రిలో జాయిన్ అయితే 24 గంటల్లో డిశ్చార్జ్ అయి ఇంటికి వెళ్లిపోవచ్చు. ఓపెన్ సర్జరీలో మాదిరిగానే లాప్రోస్కోపిక్ సర్జరీలో శరీరలోపలి భాగాలను సూక్ష్మాతిసూక్ష్మంగా చూస్తూ వ్యాధి నిర్ధారణ చేస్తూ, అవసరమైతే సర్జరీలు కూడా చేసే టెక్నాలజీ ఇప్పుడు అందుబాటులో ఉంది. ఈ డేకేర్ ప్రొసీజర్‌లో ఇన్‌ఫెర్టిలిటి సమస్యలకు వ్యాధి నిర్ధారణ, ఫైబ్రాయిడ్స్ తొలగింపు, గర్భాశయం తొలగింపు, పిసిఓడి ఉన్నట్లయితే ఓవరీస్ డ్రిల్లింగ్ చేయడం, గర్భసంచిలోపల పొరల్లో ఏమైనా సమస్యలుంటే హిస్టెరోస్కోపీ చేయడం, ట్యూబ్స్‌లో బ్లాక్స్ ఉంటే క్లియర్ చేయడం వంటివన్నీ ఓపెన్ సర్జరీలో లాగే లాప్రోస్కోపిక్ సర్జరీలో చేయడం జరుగుతుంది. భవిష్యత్తులో అన్ని సర్జరీలు లాప్రోస్కోపిక్ విధానంలోనే చేస్తారంటే అతిశయోక్తి కాదు.

ఫైబ్రాయిడ్స్ పెరుగుతున్నప్పుడు, 12 వారాల కన్నా గర్భాశయం సైజు ఎక్కువగా ఉన్నప్పుడు, గర్భం దాల్చేందుకు అడ్డంకిగా మారినపుడు ఫైబ్రాయిడ్స్‌ను తొలగించాల్సి ఉంటుంది. సాధారణంగా ఈ సమస్యతో ఆసుపత్రిలో చేరితే లాప్రోస్కోపిక్ సర్జరీ చేసి ఫైబ్రాయిడ్స్ తొలగించి 24 గంటల్లోగా ఇంటికి పంపించి వేస్తాము. ఒక్కోసారి మరుసటి రోజు పంపించడం జరుగుతుంది. 40 ఏళ్లలోపు వయస్సుఉన్నవారికి మయోమెక్టమీ చేసేందుకు ఆలోచిస్తాం. 40 ఏళ్లు పైబడిన వారిలో తప్పనిసరి పరిస్థితుల్లో గర్భాశయాన్ని తొలగించవచ్చు. మయోమెక్టమీ తప్ప ఇతర విధానాలన్నీ డేకేర్ ప్రొసీజర్‌లోచేయడం జరుగుతుంది. రోగిని ఆసుపత్రిలో చేర్చుకునే ముందే తీసుకోవలసిన జాగ్రత్తల గురించి చెప్పి సాయంత్రం డిశ్చార్జ్ చేస్తాము. హిస్టరెక్టమీ కూడా డేకేర్ ప్రొసీజర్‌లో చేసి 24 గంటల్లోపే ఇంటికి క్షేమంగా పంపించడం జరుగుతుంది.

యూరిన్ ఇన్‌కాంటినెన్సీ ఉన్నవారికి అంటే తుమ్మినా, దగ్గినా మూత్రం చుక్కలు చుక్కలుగా పడుతున్నవారికి యూరోడైనమిక్స్ ప్రొసీజర్ చేసి ఏమైనా సమస్యలున్నట్లయితే మినిమల్లీ ఇన్‌వేజివ్ సర్జరీ ద్వారా శస్త్రచికిత్స చేసి డేకేర్ ప్రొసీజర్‌లో ఇంటికి పంపించేయడం జరుగుతుంది. అధిక రక్తస్రావంతో బాధపడుతున్నప్పుడు స్కాన్‌లో ఏ సమస్యా లేదని తేలినపుడు, మెనోపాజ్ వచ్చి బ్లీడింగ్ అవుతున్నప్పుడు హిస్టెరోస్కోపీ ద్వారా కారణం తెలుసుకోవచ్చు. హిస్టెరోస్కోపీ అంటే గర్భాశయం లోపలకు స్కోప్ పంపించి ఏమైనా సమస్యలున్నాయా? సమస్య ఉంటే బెలూన్ థెరపీ ద్వారా చికిత్సను అందించవచ్చు. కాపర్ టి వాడే వాళ్లకి ఏమైనా సమస్య ఉందా? లోపల పాలిప్స్ ఉన్నాయా? ఏమైనా ఓవర్ గ్రోత్‌లు ఉన్నాయా అనే విషయాన్ని తెలుసుకోవచ్చు. ఒకవేళ సమస్య ఉంటే బయాప్సీ చేసి వ్యాధి నిర్ధారణకు పంపవచ్చు. మెనోపాజ్ తరువాత బ్లీడింగ్ అవుతున్నట్లయితే హిస్టెరోస్కోపీ సహాయంతో బయాప్సీ చేయాల్సి ఉంటుంది. ఇన్‌ఫెర్టిలిటి సమస్య ఉన్నవాళ్లలో సెప్టమ్ అంటే గర్భాశయం లోపల పొరలాగా అడ్డం ఉన్నప్పుడు, మళ్ళీ మళ్ళీ అబార్షన్ అవుతున్నప్పుడు లోపలి పొరను కత్తిరించేందుకు ఈ విధానం బాగా ఉపయోగపడుతుంది. ట్యూబర్‌క్యులోసిస్‌వల్లగానీ లేదా ఎక్కువ సార్లు అబార్షన్ అవడం వల్ల గానీ గర్భాశయంలో ఒకపొర మరొక పొరతో అతుక్కుపోయినా లాప్రోస్కోపీ ద్వారా గుర్తించవచ్చు. అవసరమైతే డేకేర్ ప్రొసీజర్‌లో సర్జరీ చేసి సాయంత్రంలోగా ఇంటికి పంపించవచ్చు.

ఈ డేకేర్ ప్రొసీజర్‌లో సర్జరీ చేయించుకున్నవారు మరుసటి రోజు నుంచే సాధారణ పనులు చేసుకోవచ్చు. ఉద్యోగానికి వెళ్లవచ్చు. ఇన్‌సెషినల్ హెర్నియా వస్తుందనే భయం ఉండదు. బ్లడ్‌లాస్ చాలా తక్కువగా ఉంటుంది. నొప్పి కూడా తక్కువ. ఇన్‌ఫెక్షన్స్ సమస్య అసలు ఉండదు. అన్ని విధాలా చాలా ఉపయోగకరమైన విధానం ఇది.

డా. మంజుల అనగాని
గైనకాలజిస్ట్ అండ్ లాప్రోస్కోపిక్ సర్జన్, బీమ్స్ హాస్పిటల్,
జూబ్లీహిల్స్, రోడ్‌నెం 1,
హైదరాబాద్,
ఫోన్: 99595 42777,
040- 39417700

ఇది ఉండగా వయాగ్రా ఎందుకు?

డాక్టర్ వర్ధన్, డాక్టర్ మాధురీ వర్ధన్
కేరళ ఆయుర్వేదిక్ కేర్,
స్పెషాలిటీ పంచకర్మ సెంటర్
స్కైలేన్ థియేటర్ లేన్, బషీర్‌బాగ్, హైదరాబాద్
ఫోన్స్: 98666 66055, 8686848383

అతని పేరు ఎస్ నాగేశ్వర్. వయసు 43. స్థూలకాయం ఉంది. ఆయనకు ఇద్దరు పిల్లలు. రియల్ ఎస్టేట్ ఏజెంట్‌గా పనిచేస్తున్నాడు. గత ఆరేళ్లుగా అతనికి మధుమేహం ఉంది. చాలా ఏళ్లుగా విపరీతంగా మద్యం పొగ తాగే అలవాటు ఉంది. అయితే రెండేళ్లుగా అంగస్థంభనలు సరిగా ఉండడం లేదు.ఆండ్రాలజిస్టును సంప్రదిస్తే వయాగ్రా మాత్రలు (25 మి. గ్రా) వేసుకొమ్మని సూచించారు. కొన్నాళ్లు ఈ స్వల్ప మోతాదుతో ఫలితం కనిపించినా ఆ తరువాత డోసు పెంచాల్సి వచ్చింది. కానీ, పోను పోను 100 మి. గ్రా. మాత్రలు వేసుకున్నా స్థంభనలు రావడం లేదు. మాత్రల ద్వారా ఆశించినఫలితం లేకపోగా దుష్ప్రభావాలైతే వచ్చాయి. ముఖ్యంగా తలనొప్పి, ముఖం కమిలిపోవడం, విరేచనాలు, చూపు మసక బారడం, వంటి లక్షణాలు మొదలయ్యాయి. ఈ విషయమై డాక్టర్‌కు చెబితే వయాగ్రా మాత్రలకు భిన్నంగా ఇతర విధానాల గురించి చెప్పారు. వాటిలో అంగానికే ఇచ్చుకునే పినైల్ ఇంజెక్షన్ గురించి, అంగంలోకి మాత్రలను చొప్పించే విధానం గురించి చెప్పారు ఒకవేళ ఇవేవీ పనిచేయకపోతే, అంగంలోకి పంపించే కృత్రిమ ఇంప్లాంట్‌ను అమర్చుకోవచ్చని చెప్పారు. అవన్నీ విని అతడు విపరీతంగా ఆందోళనకు గురయ్యాడు. అవేవీ వద్దనుకుని తన సమస్యకు ఆయుర్వేదంలో వైద్యం ఏమైనా ఉందేమో తెలుసుకోవడానికి మా వద్దకు వచ్చాడు.

* * *

ఆయుర్వేద పరిభాషలో అంగ స్థంభనా లోపాన్ని ధ్వజ భంగం అంటారు. దీనికి మౌలికంగా సప్తధాతువుల్లో లోపం ఏర్పడటమే కారణం. ప్రాథమికంగా ఆహారపు అలవాట్లు, జీవన విధానాల్లోని లోపాలే ఉంటాయి. ఇవే ముందు అతనికి మధుమేహం రావడానికీ, ఆ తరువాత లైంగిక సమస్యలు రావడానికి కారణమయ్యాయి. వీటన్నిటికీ వెనుక అగ్నిమాంద్యం అంటే జీర్ణవ్యవస్థ లోటుపాట్లు ప్రధాన మూలంగా ఉంటాయి. ఈ లోపాలు ధాతు పోషణ సరిగా జరగనివ్వవు. ధాతు లోపాలతో స్రోతస్సుల్లో అవరోధాలు చోటుచేసుకుంటాయి. ఇవి శరీరంలో వాతం, కఫం పెరగడానికి కారణమవుతాయి. వాతాల్లో ప్రత్యేకించి అపాన వాతం వీరిలో పెరుగుతుంది. దాని ఫలితమే లైంగిక సమస్యలు. వాత పరమైన దోషాలు ఏర్పడినప్పుడు కండరాల వ్యవస్థ, నరాల వ్యవస్థ దెబ్బ తింటాయి. రక్తప్రసరణలోనూ తేడాలు వస్తాయి. మధుమేహం వల్ల నరాల వ్యవస్థ దెబ్బ తింటుంది. నరాలు దెబ్బ తినడం వల్ల అంగస్థంభనా సమస్యలు మొదలవుతాయి. మానసిక, నాడీ, రక్తప్రసరణ, హార్మోన్ లోపాలు, లైంగిక భాగాల్లోని లోపాలు వీటిలో ఏ కారణమైనా స్థంభనా సమస్యకు కారణం కావచ్చు. ఇవే కాకుండా మరికొన్ని ఇతర కారణాలు కూడా ఉంటాయి.

వయగ్రాతో ఏమవుతుంది?

అల్లోపతి డాక్టర్‌ను సంప్రదిస్తే, వయాగ్రా, లెవిట్రా, సియాలిస్ వంటి మాత్రలు రాస్తారు. ఈ మాత్రల వినియోగం చాలా సురక్షితమనే చెబుతారు. కానీ, ఈ మాత్రల వల్ల వచ్చే దుష్ప్రభావాలు ఇన్నీ అన్నీ కావు. వాటిలో ప్రధానంగా తలనొప్పి, ముఖం కమిలిపోవడం, విరేచనాలు కావడం, చూపు మందగించడం, ప్రతిదీ నీలి రంగులో కనిపించడం, తరుచూ తుమ్ములు రావడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. అంతకు ముందే అధిక రక్తపోటు, గుండె జబ్బులు ఉన్న వారు ఈ మాత్రలు వాడితే ప్రాణ హానికే దారి తీయవచ్చు. ఇంతే కాకుండా, మాత్రల డోసు పెరిగితే అంగస్థంభన నాలుగు గంటలకు పైగా అలాగే ఉండిపోవచ్చు. వెంటనే వైద్య చికిత్సలు తీసుకోకపోతే శాశ్వత నపుంసకత్వం రావచ్చు.

ఆయుర్వేద చికిత్సలు

మధుమేహ నియంత్రణకోసం నాగేశ్వర్ వేసుకుంటున్న అల్లోపతి మాత్రలను కొనసాగించమనే చెప్పాం. కాకపోతే వాటికి అనుబంధంగా కొన్ని ఆయుర్వేద మాత్రలు కూడా సూచించాం. శరీరంలో కల్మషాలు పేరుకుపోవడం వల్ల అతని ధాతువుల్లో లోపం ఏర్పడినందున దీపన, పాచన చికిత్సలు చేస్తూ, పంచకర్మ చికిత్సలు చేశాం. ఈ చికిత్సలోనూ ప్రత్యేకించి, వాజీకరణ వస్తి చేశాం. మందుల్లో ప్రధానంగా, యశ్వగంధ, కపికచ్చు సూచించాం. అలాగే లైంగిక శక్తిని పెంచే ఆహార పానీయాలు సూచించాం. పొగ తాగడం, మద్యం సేవించడం పూర్తిగా మానేయమని చెప్పాం. పంచకర్మ చికిత్సల తరువాత వాజీకరణ ద్రవ్యాలు తీసుకోవడం మొదలైన కొద్ది రోజుల్లోనే అతని స్థంభనల్లో మెరుగుదల కనిపించడం మొదలయ్యింది. ఆ తరువాత స్వల్పం కాలంలోనే శృంగారంలో సంపూర్ణంగా పాల్గొనే సామర్థ్యం వచ్చింది. పైగా వయాగ్రా వేసుకోవడం వల్ల కలిగే ప్రయోజనం తాత్కాలికమే. అదే ఆయుర్వేద వైద్య చికిత్సతో ఆ ప్రయోజనం శాశ్వతంగా ఉంటుంది.

ఎనిమిదేళ్ల సోరియాసిస్ పోయిందిలా!

అతని పేరు వి సుధాకర్. తనదైన ఒక చిన్న వ్యాపారం ఉంది. వయసు 56. గత ఎనిమిదేళ్లుగా సోరియాసిస్ సమస్యతో బాధపడుతున్నాడు. మొదట్లో కొంత కాలం తల భాగానికే పరిమితమైన వ్యాధి ఆ తరువాత క్రమంగా శరీరమంతా వ్యాపించింది. తన పరిస్థితి అందరికీ తెలిసి పోవడం వల్ల తన కూతుళ్లు ఎవరికీ పెళ్లి సంబంధాలు రాకుండా పోయాయి. అల్లోపతి మందులు ఎంత కాలం వాడినా ఆ వాడుతున్నన్ని రోజులే కాస్త తగ్గుముఖంగా అనిపించేది. మందులు ఆపేయగానే మళ్లీ తీవ్రమయ్యేది. ఆ తరువాత కొంత కాలం పాటు ఆయుర్వేదం, హోమియో మందులు కూడా తీసుకున్నారు. ఈ కాలంలోనే ఒకసారి న్యూమోనియా వచ్చి హాస్పిటల్‌లో చేరవలసి వచ్చింది. ఈ స్థితిలో వ్యాధి నిరోధక శక్తి బాగా తగ్గిపోవడం, సోరియాసిస్ చికిత్సలు పూర్తిగా నిలిపివేయడం వల్ల సోరియాసిస్ ఒక్కసారిగా తీవ్రమయ్యింది. చివరికి అది సోరియాటిక్ ఆర్థరైటిస్‌గా మారింది. ఏమాత్రం కదల్లేని, కనీసం నిలబడటం కూడా సాధ్యం కాని పరిస్థితి ఏర్పడింది. ఒక పక్క తన శారీరక సమస్య, మరో పక్క కూతుళ్లకు పెళ్లిల్లు కాకుండా పోతున్నాయన్న వ్యధ అతన్ని బాగా కుంగదీస్తూ వచ్చాయి. ఎనిమిదేళ్లుగా ఎన్ని రకాల వైద్య చికిత్సలు తీసుకున్నా వ్యాధి ఏమీ తగ్గలేదు గానీ, కుటుంబ ఆర్థిక పరిస్థితి మాత్రం బాగా దెబ్బతినిపోయింది. ఇవన్నీ కలిసి తనకొక తీవ్రమైన డిప్రెషన్‌లో ముంచేశాయి. చికాకు, అసహనం, డిప్రెషన్ అతనిలో విపరీతమైన ఆకలి పెంచేశాయి. విచిత్రంగా, నలుగురు తినేంత ఆహారం తానొక్కడే తినేసేవాడు. సోరియాసిస్ ఇక ఏ రకంగానూ తగ్గదని గత ఏడాదిగా అసలు మందులు వేసుకోవడం పూర్తిగా మానేశాడు. ఏ మాత్రం కదల్లేకుండా, నిలువెల్లా చేపపొట్టు పరుచుకున్నట్లు అనిపించే స్థితిలో కుటుంబ సభ్యులు అతన్ని మా వద్దకు తీసుకు వచ్చారు.

* * *

అతని చర్మమంతా పూర్తిగా పొడిబారిపోయి ఉంది. కీళ్లు ఏ మాత్రం కదల్లేని స్థితికి (సోరియాటిక్ ఆర్థరైటిస్) చేరుకున్నాయి. శరీరమంతా చేపపొట్టులా రాలిపోవడం అంటే శరీరంలోని ప్రొటీన్ అంతా బయటికి వెళ్లిపోవడమే. ఇది శరీరాన్ని బాగా బలహీనపరిచింది. ఇక ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే అతనికి ఔషధ తైలాలతో మర్దన చేసే అభ్యంగన చికిత్స ప్రారంభించాం. ప్రతి గంటకు ఒకసారి చొప్పున ఈ మర్దన చికిత్సలు కొనసాగించాం. దీనికి తోడు కడుపులోకి ఆర్ కె లేహ్యం మాత్రలు కూడా ఇచ్చాం. దీనివల్ల కేవలం ఐదు రోజుల్లోనే పొట్టు రాలడం తగ్గిపోయింది. మచ్చలన్నీ పోయి చర్మం సాధారణ వర్ణానికి వచ్చింది. ఫలితంగా అప్పటిదాకా అతనిలో పేరుకుని ఉన్న ఆత్మన్యూనతా భావం పోయి, వ్యాధి తగ్గిపోతుందన్న నమ్మకం అతనిలో క్రమంగా ఏర్పడుతూ వచ్చింది. అప్పటిదాకా మంచానికే అంటుకుపోయిన అతడు లేచి నిలబడే స్థితికి వచ్చాడు. డిప్రెషన్‌నుంచి తేరుకోవడం వల్ల అసహజమైన అతని ఆకలి తగ్గిపోయి సాధారణ స్థితికి వచ్చేసింది. అతని చర్మంలోని పొడి తనం పోయి కండరాలు కాస్త శక్తి పుంజుకోగానే అతని కీళ్ల సమస్య మీద దృష్టి సారించాం. అందులో భాగంగా కండరాల్లోని పెళుసుదనం పోయి, కదలికల్ని పెంచడానికి స్వేదన చికిత్సలు ప్రారంభించాం. మామూలుగా అయితే విధిగా సోరియాసిస్ ఉన్న వారికి పంచకర్మ చికిత్సలు చేస్తాం. కానీ, వమనం, విరేచన చికిత్సలను తట్టుకునే శక్తి అతనికి లేకపోవడం వల్ల వస్తి చికిత్స(బృహ్మణ వస్తి) కే పరిమితమయ్యాం. వ్యాధినుంచి కోలుకున్న ఓ ఆరుమాసాల తరువాత పూర్తి స్థాయిలో పంచకర్మ చికిత్సలు చేస్తామని చెప్పాం. మల ద్వారం ద్వారా ఔషధాల్ని పంపే వస్తి కర్మతో ఔషధాల్ని గ్రహించే శక్తి శరీరానికి మామూలుగా కన్నా 80 శాతం ఎక్కువగా ఉంటుంది. అందుకే రోగి చాలా త్వరితంగా శక్తి పుంజుకున్నాడు. ఆ తరువాత అవసరమైన చికిత్సలన్నీ నెలరోజుల్లో పూర్తి అయిపోయాయి. కీళ్ల కదలికల కోసం కాంచనాల గుగ్గులు, త్రిఫళా గుగ్గులు, గుడూచి, పునర్నవ మండూరం వంటి మందుల్ని కడుపులోకి ఇచ్చాం. వాస్తవానికి అతని కీళ్ల కదలికలు ఆగిపోవడానికి మోకాళ్లలోని లిగమెంట్లు, టెండాన్లు బిగుసుకుపోవడమే కారణం. ఈ మందులు, తైల మర్దనలు అతని కీళ్లకు ఎంతో మేలు చేశాయి. వైద్యచికిత్సల వల్ల సోరియాసిస్ తగ్గడంతో పాటు కీళ్ల సమస్య కూడా తొలగిపోయింది. ఆ తరువాత ఓ సంవత్సరం దాకా మందులు వాడమని చెప్పాం. అతడు క్రమం తప్పకుండా మందులు వాడటం వల్ల ఫలితాలు చాలా వేగంగా కనిపించాయి. అన్నిటినీ మించి అప్పటిదాకా వెనుదిరిగిపోయిన పెళ్లి సంబంధాలు తిరిగి రావడం మొదలయ్యింది. అతడు వ్యాధి నుంచి కోలుకున్న కేవలం నాలుగు మాసాలకే అతని పెద్ద కూతురు పెళ్లి కూడా అయ్యింది. సోరియాసిస్ కేవలం శారీరక సమస్యగానే కాకుండా కొన్ని సార్లు అది సాంఘిక సమస్యగా కూడా మారవచ్చు అందుకే సోరియాసిస్ తొలిదశలో ఉన్నప్పుడే ఆయుర్వేద చికిత్సలు తీసుకుంటే ఆదిలోనే ఈ సమస్యలకు అడ్డుకట్ట వేయవచ్చు.

డాక్టర్ పూజారి రవికుమార్
ఆర్ కె ఆయుర్వేదిక్ అండ్
సోరియాసిస్ సెంటర్
క్లినిక్స్: హైదరాబాద్,విజయవాడ,
వైజాగ్, హన్మకొండ,కర్నూలు,
తిరుపతి
ఫోన్స్:98492 54587,
040-23057483

డైలీ సుడోకు -896

						7		9
8	6	7	9				1	
					5			2
3			7	4				6
		6	5		3	9		
2				6	9			3
5			2					
	9				7	2	5	8
1		8						

ఎలా పూరించాలి?

- ✔ ప్రతి బాక్స్‌లోనూ తొమ్మిది గళ్లు ఉంటాయి.
- ✔ నిలువుగానూ, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి.
- ✔ ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.

సమాధానం రేపటి పేజీలో...

డైలీ సుడోకు 895 సమాధానం

8	1	4	5	2	6	7	3	9
2	6	7	9	4	3	1	5	8
5	3	9	1	7	8	2	6	4
6	9	1	3	8	7	4	2	5
4	2	3	6	5	1	8	9	7
7	5	8	2	9	4	6	1	3
9	4	6	7	3	2	5	8	1
1	7	5	8	6	9	3	4	2
3	8	2	4	1	5	9	7	6